


# పవర్ (కట్)

ఎండిపోయిన కాలవకాని, చెరువుకాని, కుంటకాని, ఏదైనా చూస్తూంటే లోపల్నుంచి మాటల్లో చెప్పలేని భయం పుట్టుకొస్తుంది. నీరు నిండుగా వున్న నదికేసి చూస్తూంటే కళ్ళకెంతో అందంగా వుండి మనసు కెంతో ఆనందంగా వుంటుంది. పరిగెత్తే గుంపుల గుంపుల మబ్బులకేసి చూస్తూంటే ఎన్నో వూహలు ఆకారాల్ని దించుకుంటాయి. మబ్బులతో మనసు కలిపితే ఎన్నో ఆటలు మనకుమనం ఆడుకోవచ్చు. శ్రీకృష్ణుణ్ణి నీలమేఘశ్యాముడన్నారు. నల్లనివాడన్నారు. పరమశివుడ్ని వైట్‌మాన్ అండ్ పార్వతీదేవిని తెల్లని తల్లి అన్నారు. గరళకంఠుడైన శివశంకరస్వామి వారిని చిత్రకారులెందుకో తెల్లనివాడు, పద్మనయనమ్ముల వాడు అని కీర్తించక సదా నల్లనివాడుగా చిత్రించి భక్తులను మిస్‌గైడ్ చేస్తూ వచ్చారు.

దేవతలు అనగా మేజర్‌గాడ్స్ తపస్సు చేసి మన భక్తితో వాళ్ళని విసిగించి వూదరకొట్టితే ప్రత్యక్షమయి నరుడా ఏమి నీ కోరిక అని అడిగిన వరాల్ని నోర్మూసుకుని వచ్చినట్టు ఇచ్చేస్తారు. వరాలంటే పవర్స్ కదా! పవర్ అంటే శక్తి — ఎలక్ట్రిసిటీని మనం పవరంటున్నాము కాని నిజానికి అట్లకాడలో మాత్రం పవరు లేదా? మీ ఆవిడ అట్లకాడని విసిరిందనుకోండి మీరెక్కడుంటారు? అలవైకుంఠపురంబులోనో - ఆమూల సౌధంబుదాపలో వుంటారు. అట్లకాడే కాదు చెంబు విసిరిందనుకోండి. చెంబే కాదు గరిటో, గదో విసిరిందనుకోండి (నా మొహం, మనిళ్ళలో గద లెక్కడుంటాయి. డ్రామా కంపెనీల్లో చెక్క గదలుంటాయి. మెరుక్కాగితాలంటించినవి.) గదలు బ్రాహిమ్మ ఇళ్ళలో వుండవు. ఆ మాటకొస్తే ఎవరిళ్ళలో మటుకు ఎందుకుంటాయి. ఎవరేనా గద ధరించి ఆఫీసుకెడతారా? వెళ్ళరుగాక వెళ్ళరు. అసలెవరింట్లో అయినా విష్ణుచక్రం వుందా, ఎందుకుంటుంది? జంతికల గొట్టం వుండచ్చు. దేవతలు అలా ఆయుధాలు ధరించి తిరుగుతారు కాబోలు అనేట్లు బొమ్మల్లో కనబడతారు. అవి వారి సూపర్ పవర్స్ అన్నమాట. మేష్టర్లకి బెత్తంలో పవరున్నట్లు పోలీసువారికి లాఠీలోనూ, ఆడదానికి గరిటెలోనూ, బండివాడికి చెర్నాకోలలోనూ ఇలా రకరకాలుగా పవరుంటుంది. అది లాగేస్తే 'పవర్ కట్' అయి తోక తెగిన వక్కలా అయిపోతాడు.

ఈ రోజుల్లో 'పవర్ కట్' అంటే కరెంట్ తీసెయ్యడం అనే అర్థం వచ్చింది కాని - అంతకంటే నిగూఢార్థం మరోటుంది. అది తరవాత చెప్తాను. విద్యుత్‌కోత అంటే విద్యుత్తుని కత్తిపీట ముందేసుకుని పొట్లకాయనో, బీరకాయనో, అరటికాయనో తరిగినట్లు తరుగుతారనా - కాదు, మనకు పవర్ లేకుండా తీసేస్తారు. దీపాలుంచుకునే హక్కును, వెల్తురులో జీవించే హక్కును చేతుతారా తొలగిస్తారు. ఇది మహాపరాధమే - పవరెప్పుడూ గదాధారి గదను (అధికారాన్ని) ధరించే వాడి చేతులో వుంటుంది. వాడు దాన్ని ఉపసంహరిస్తూ వుంటాడు. సంహరించడానికీ, ఉపసంహరించడానికీ యమ తేడా వుంది. ఉపసంహారము అంటే ఎక్కడికో అక్కడికి తెగ్గొట్టి ఇది అయిపోయిందిరా నోర్మూసుకుని పోయి పడుకో అని తోలెయ్యడం. సంహారం అంటే ఏకంగా కటాకట్ బలిచ్చెయ్యడం లాటిది. పవర్ కట్ అంటే పిండితార్థం లోకుల్ని పాలకులకి బలివ్వడం అన్నమాట. దీపాలు తీసేస్తే ఆసుపత్రుల్లో చచ్చేవాళ్ళు చస్తారు, రైళ్ళల్లో, బస్సుల్లో, రోడ్లమీద దొంగతనాలు, దోపిడీలు, కొట్టుకోడాలు, పొడుచుకోడాలు జరిగితే జరుగుతాయి. దీపాల్ని తీసెయ్యడంవలన, శక్తిని ఉపసంహరించడంవలన క్షయం పెరిగిపోదా? అసలు చీకటి చీకటి పనులకు ప్రోత్సహించుడు గదా — ఇవతల ఫామిలీ ప్లానింగు పెట్టుకుని అవతల పవర్ కట్స్ విధించడంలో ఏమైనా యింగితం వుందా? చీకటివలన చిలిపి పనులు లావవుతాయా, అవవా? ఈ పవర్ కట్ కాలాన్ని వేస్టు చెయ్యకుండా వుండేవారు వుంటారు - ఆంధ్రప్రదేశ్ జనాభా పెరిగిపోయిందనుకోండి - వుంగా వుంగా - అమ్మా అమ్మా లతో దేశం దద్దరిల్లిపోతుంది. పవర్ కట్‌వల్ల ఇండస్ట్రీల్లో ఉత్పత్తులు పడిపోయినా, మరోచోట ఉత్పత్తులు పెరుగుతాయనడానికిదో ఉదాహరణ.

సహజంగా గవర్మెంటు వాళ్ళు పరమచింతా దీక్షితులు, నిత్య శాడిస్టులు. ఎవరు సంతోషంగా వున్నా వెంటనే పన్నులేసేస్తారు. ఈ శాడిస్టు మృగాలకి పవర్ కట్ ఒక కళాకేళి.

ఈ మధ్యనెక్కడో చదివాను - డాక్టర్లు, దుకాణాల వారూ చిన్న చిన్న జనరేటర్లు కొనుక్కుని ఆపరేషన్లూ, వ్యాపారాలు చేసుకుంటూంటే - కుళ్ళు ప్రభుత్వం వాళ్ళు అంటే విద్యుదధికార్లు 'ఠాట్ అల్లా మీరు సొంత జనరేటర్స్ పెట్టుకుని పవర్ వాడుకోడానికి వీల్లేదు - అరెస్ట్ చేస్తాం. డొక్క చీరేస్తాం' అని తిండీ, బట్టా ఇవ్వని మొగుడు పెళ్ళాం మీద నోరుచేసుకున్నట్లు నోరుచేసుకుందిట. గుడ్లు ఎర్రచేసిందట!

అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినానివ్వదని — కరెంటేమో కోత, వీళ్ళు ఇవ్వరు, ఇవ్వలేరు - (వేళా పాళా లేకుండా సమ్మెలు చేస్తామని బెదిరిస్తూ వుంటారు — వావీవరసా లేకుండా వేళాకోళమాడినట్లు - అవ్వను చూసి వసంతం జల్లినట్లు - ఈ కాస్త ముండా కరెంటుకు తోడు సమ్మె ఓటిట - ఓయి దరిద్ర భారతదేశమా - ఎలాటి సంతానమమ్మా నీది?)

ఈ చిన్న చిన్న బుల్లి బుల్లి జనరేటర్లకు - ముండా గవర్మెంటు పర్మిషనోటి, పైగా మీటరు తగిలిస్తారట - మీటర్ ప్రకారం ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టాల్సిందేనట -) వారెవ్వా - ఏమి న్యాయం? ఏమి ధర్మం? ఏమి నీతి? వెనకటికి కోడలు పిల్లకు ముష్టివాడ్ని పొమ్మనే హక్కు లేనట్లు అత్తగారు ఆసీనుని ముష్టివాడ్ని పిలిచి రీయనాక్టు చేసిందట.

మన చవురుతో మన ఇంజన్‌తో మనం కరెంట్ తెచ్చుకుంటే - ఈ గవర్మెంటు కెందుకింత కడుపుబ్బు, కన్నెర్ర, కడుపు మంట, కాలి మంట — అస్సలిలాటి రూల్సు వెయ్యడానికి సిగ్గెందుకు వెయ్యదో అర్థం కాదు.

కరెంట్ కోత వలన కలిగించే అసౌకర్యానికి, అమర్యాదకి, నష్టానికి ప్రజలు దావా వేస్తే — ప్రజల కివ్వాలి నష్టపరిహారం! అవునా కాదా?

ఈ గవర్మెంట్లు పుచ్చిపోయాయి.

ప్రజల పవర్ని ప్రభుత్వాలుగాక ప్రభుత్వాల చేతుల్లోని పవర్ని ప్రజలే కట్ చెయ్యాలి. అజ్ఞానాంధకారం అంధకారాల్లో కెల్ల చెడ్డది కదా!

పవర్ కట్ల పద్మవ్యూహంలో సామాన్యుడి యాతన దేనికి? ఈ పాపం ఎవ్వరిదని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోడానికి వీల్లేదు. అడగండి పెద్దసారువాళ్ళని వాళ్ళ జేజెల్ని ... ఏ దేశ చరిత్ర మాసినా ఏమున్నది గర్వకారణం?

—పురాణం సీత

---

**శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ:** గత నలభై అయిదు సంవత్సరాలుగా ప్రముఖ పాత్రికేయులుగా తెలుగువారికి సేవలనందించిన శ్రీ శర్మగారు ఇక మనకు లేరు అనితెలియజేయడానికి బాధ కలుగుతున్నది. చాలాకాలంగా ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులుగా, ఆయన పురాణం సీత పేరుగా రచించిన ఇల్లాలి ముచ్చట్లు తెలుగు పాఠకలోకానికి చిరపరిచితమే. ఆయన 1987 లో ప్రచురించిన పై ఉల్లేఖనం 1997లోని పరిస్థితులకు కూడా అన్వయిస్తున్నదంటే ఆయన ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత ఏపాటిదో తెలుస్తుంది. 1984 లో మొట్టమొదటి తెలుగు కళా సమితి ప్రారంభ కార్యక్రమం సంక్రాంతి పండుగనాడు ఆయన ముఖ్యాతిథిగా, రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు విజేత ప్రతినిధిగా విచ్చేసి మనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుజ్యోతి నామకరణానికి కూడా హాజరయ్యారు. మన తెలుగు జ్యోతికి ఆంధ్రజ్యోతికి వారధిగా నిలిచారు. అయిదు సంవత్సరాలక్రితం పార్శ్వ పక్షవాతంతో హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటూండేవారు. ఆయన ఎన్నో నవలలు, కథలు, కథానికలను కూడా రచించారు. తెలుగు కళాసమితి, తెలుగుజ్యోతుల తరఫున ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతున్నాం.... కి.ర.